# జ్యోతిష్యం !

దైవజ్ఞ రత్న, జాతక ముత్య, జ్యోతిష పగడ అయిన తల్లక్ మగ్ద గారంటే పబ్లిక్‌లో ఎంత గొప్ప పేరో చెప్పలేం. చిత్రం ఏమిటంటే ఆయన ఎవ్వరి జాతక చక్రం చూడరు. చెయ్యి చూడరు, పుట్టుమచ్చలు చూడరు. పైగా అడ్డదిడ్డమైన ప్రశ్నలు వేస్తే తంతారు కూడా.

మరేం చేస్తారయ్యా అంటే – జాతకుడి ఎదురుగా ఏడు పువ్వులు, ఏడు రకాలవి పెడతారు. జాతకుణ్ని జన్మ తేదీ చెప్పి, ఓ పువ్వు ముట్టుకోమంటారు. జాతకుడు పుట్టిన తేదీ, ముట్టిన పువ్వుని బట్టి–తనకి తట్టింది చెప్తారు. ఆయన జాతకమో, జాతకుల జాతకమో గాని ప్రతివాడూ ఎంతో రిలీఫ్‌తో వెళ్ళేవాడే! ఆనందంగా వెళ్ళేవాడే!

"చూడు చారీ! నువు అమెరికా యాత్ర చెయ్యబోతున్నావు గదా! ఇదుగో బుష్‌గారు నాకు వ్రాసిన ఉత్తరం చూడు. ఆయన అమెరికన్ ప్రెసిడెంట్‌గా గెలుస్తాడని నేను ప్రెడిక్ట్ చేశాను. దానికి ఆయన ఇచ్చిన సమాధానం ఇది."

చారి చారిడేసి కళ్ళు పెట్టుకుని చూశాడు. నిజమే! బుష్ వ్రాసిన ఉత్తరమే!

జ్యోతిష పడగగారు మళ్ళీ ఇలా అన్నారు. "ఇది చూడు నాయనా! ఫ్రంట్ ఛైర్మన్ అవుతారని అన్నగారికి ప్రెడిక్ట్ చేశాను. అప్పుడు వారు వ్రాసిన సమాధానం."

ఫార్ములా తెలీని వారి గుండె పాపం చెరువైపోయింది. అబ్బ! కనిష్కుడి క్కూడా ఇంత జ్యోతిష్యుడున్నాడో లేడో?

ఫార్ములా ఏమిటంటే – పోటీ చేస్తున్న అందరికీ – "ఈ పోటీలో తమరికే

విజయం తథ్యం. ఊరికే పోదు నా జోస్యం." అని జాబులు వ్రాస్తారు తల్లిక్ మగ్గగారు గెలిచినవారు సహజంగా థ్యాంక్స్ ఎక్‌నాలెడ్జ్ చేస్తూ జాబు వ్రాస్తారు. ఓడిపోయిన వారు ఊరుకుని వుండవచ్చు. లేదా తీరుబడిగా తిడుతూ తిరుగు టపా పంపి వుండచ్చు. కాని అది చూపించరు కదా జాతకముచ్చగారు.

చెమ్మగిల్లిన కళ్ళతో చమత్కారం చూస్తూ వుండిపోయిన చారిని "మరి జ్యోతిష్యం అంటే ఏమనుకున్నావ్! నీ డేట్ ఆఫ్ బర్త్ చెప్పు ఇహ చెస్తాను" అన్నారు దైవజ్ఞ రత్నగారు.



ఎరుపు రంగులో వున్న ఏదో పువ్వు ముట్టుకుని "ఏడూ, ఒకటి, పందొమ్మిది వందల అరవై ఒకటి సర్" అన్నారు చారి.

"నెలా, సంవత్సరం అక్కర్లేదు వత్సా! తేదీ చాలు, జాతకం అంతా చెప్పేస్తాను" అని ఎర్ర పువ్వుతీసి చారి చేతిలో పెట్టాడు. చారి భక్తిగా చెవులో పెట్టుకున్నాడు.

అందుకున్నాడు తల్లిక్ మగ్దగారు. "చూడు చారీ! నువ్వు ముట్టుకుంది ఏడో పువ్వు. నువు పుట్టింది ఏదో తారీఖు. నీకు ఇరవై ఏడు సంవత్సరాలు పూర్తయినాయి".

చెవులో పువ్వు పెట్టుకున్న చారి ఆశ్చర్యపోయాడు. తేదీ చెప్తే ఇంత కరెక్ట్‌గా ఎలా చెప్పారబ్బా!

విజృంభించారు తల్లిక్ మగ్దగారు. "నీకు డబ్బు విలువ తెలుసు నాయనా!

(ఎవడికి తెలీదు గనుక!)

"నీ బంధువులూ, స్నేహితులూ నీ సొమ్ము తినాలని చూస్తూ వుంటారు.

(ఎవడికైనా అలానే అనిపిస్తుంది.)

నువ్వు సహజంగా అమాయకుడివి. చాలా మంచివాడివి.

(ప్రతివాడూ అలానే అనుకుంటారు)

కాని నీ మంచితనానికి ప్రస్తుతం గుర్తింపు లేదు. (ఎంత నిజం!)

నీ సహోద్యోగులు నీ మేధాశక్తిని. నీ శరీర శ్రమని ఉపయోగించుకుని బాగుపడుతూ వుంటారు. (చాలా కరక్ట్‌గా చెప్పారు)

ప్రస్తుతం కొద్దిగా ఇబ్బందుల్లో వున్నావు.

(కాదనగలడా ఏ మానవుడైనా?)

ఇవి గడ్డు రోజులు! మానసికంగా బాధపడుతున్నావు.

(అందుకే గదా తమరి దగ్గరి కొచ్చింది)

ఏం బాధపడకు, రెండు సంవత్సరాల్లో ఈ శని వదిలిపోతుంది.

(రెండు సంవత్సరాల తర్వాత ఎవడు చూశాడు?)

అక్కడి నుంచి నీ జాతకం బ్రహ్మాండంగా వుంటుంది మళ్ళీ. (ఛా!)

నీకు ప్రమోషన్ డెఫినెట్!

(ఇంకా ముప్పై ఏళ్ళు సర్వీసుంటే ప్రమోషన్ డెఫినెట్ కాక ఏమిటిట పిండం!
పైగా అమెరికా కూడా వెళుతుంటే)

నువు అమెరికా వెళ్ళిం తర్వాత నేన్నీకు జ్ఞాపకం వుంటానో వుండనో?

(అమ్మమ్మ! ఎంత మాట!)

చారి గారి లాగానే - రాజుగారూ, గుప్తాగారూ, చౌదరిగారూ, నాయుడుగారు, దాసుగారు, మస్తాన్‌గారు, జాన్సన్‌గారు - వారు వీరు ఏల - వేలమంది తల్లిక్ మగ్గారి దగ్గరికొచ్చి, జ్యోతిషం చెప్పించుకుని ఆనందంతో పొర్లిపోతారు. జిగ్‌జిగేల్ మంటూ గగన పుష్పాలు దొర్లిపోతాయి.